
# అమెరి'కులాసా' కథలు
## – వంగూరి చిట్టెన్ రాజు





# -38-

## అమెరి"కరోనా కకావికలం' కథ

గత నెల్లాళ్ళగా ఈ కోవిడ్-19 అనగా కరోనా అనే ఒకానొక సూక్ష్మజీవి ప్రపంచం లో సృష్టిస్తున్న కకావికలం అంతా ఇంతా కాదు. కనీసం ఆరు అడుగుల లెక్కన మొగుడు, పెళ్ళాలు "సంసారిక దూరం", ఇతరులు 'సామాజిక దూరం' పాటిస్తూ, పార్టీలూ, గేర్టీలూ, పబ్ లూ, పిక్నిక్ లూ, పెళ్ళిళ్ళూ, సామూహిక వ్రతాలూ, ఆఖరికి తద్దినాలూ, సంతర్పణలూ, రోజు వారీ సన్మాన సభలూ, శాలువా కప్పుడూ, చెక్క ముక్కల పంపిణీలూ కూడా మానేసి ఈ భూగోళం లో ఉన్న మానవాళి యావత్తూ ప్రాణాలని కాపాడుకోవలసిన ఈ విపత్కర సమయం లో కేవలం ఊహా జనిత 'అబద్ధపు' ఉదంతాలతో ఈ 'కరోనా కకావికలం" వ్రాయడం దుస్సాహమే కానీ పాఠకులకి ఆట విడుపు కోసం కాస్సేపైనా ఆహ్లాదం కలిగించగలడమే నా ఉద్దేశ్యం అని మనవి చేసుకుంటున్నాను. నవ్వొచ్చినప్పుడు నవ్వడం కన్నా ఏడుపు వచ్చినప్పుడు నవ్వడమే చెప్పుకోదగ్గ విశేషం అన్నారు బహుశా ముళ్ళపూడి వారు.

ఈ కరోనా లాంటి అంతు పట్టని మహమ్మారిని గుర్తించి, బయట పెట్టిన ఆ చైనా డాక్టర్ ని ముందు నోరు మూయించి, తర్వాత జైల్లో పెట్టాక ఆయన చనిపోయాక ఎంత ప్రయత్నించినా కూడా ఈ కరోనా ఎగుమతిని ఆపడం ఎవరి వల్లా కాలేదు. పైగా అది గగన విహారి. అంటే విమానాల్లో ప్రయాణం చేస్తూ దేశ దేశాలకీ వెళ్ళి స్థిరపడుతుంది. కానీ ఎప్పుడైతే మనం ఎవరినీ ముట్టుకోకూడదూ, ఆరు అడుగుల 'సామాజిక దూరం" పాటించాలీ అనే సూత్రం విన్నానో ఎందుకైనా మంచిది అని ఆ దూరం ఇంకా బాఘా పెంచి మా క్వీన్ విక్టోరియా ని ఇండియా పంపించేశాను.

ఇక డానల్డ్ ట్రంప్ గారు కుటుంబ సమేతంగా ఇండియా విహార యాత్రకి వెళ్లినప్పటికే ఈ కరోనా ప్రపంచం అంతా వ్యాపించడం మొదలు పెట్టినా అప్పటికి ఈ ఆరు అడుగుల దూరం ట్రిక్కు తెలియక ఆయనా, మోడీ గారూ, మోడీ గారు విరామం ఇచ్చినప్పుడల్లా భారత రాష్ట్రపతి కోవింద్ గారూ ట్రంప్ గారితో ఎడాపెడా కర చాలనాలూ, హగ్గింగులూ, వీపులు గోక్కోవడాలూ, చేతులు కలిపి గాల్లో తెగ ఊపేయడాలూ జరిగేశాయి. తీరా ఆయన అమెరికా తిరిగి వచ్చాక ఈ కరోనా తీవ్రతరం కావడంతో ట్రంప్ గారు కోవిడ్ అనబోయి కోవింద్ అంటు వ్యాధి అని ప్రస్తావించడమే కాక "అమెరికా వాసులారా, అందరం కలిసి ఆ కోవింద్ కోరలు పీకేద్దాం. మీరు చెయ్యవలసిందల్లా కొన్నాళ్ళ పాటు కరచాలనాలు, హై ఫైవ్ లూ, హగ్గింగులూ తదితర 'ఒకరిని ఒకరు ముట్టుకునే పనులు" వాయిదా వేసి "నమస్తే" అంటూ దూరం నుంచే పలకరించుకుంటూ మాతో సహకరించండి" అని సాక్షాత్తూ శ్వేత సౌధం లోనే విలేఖరుల సమావేశం లో రెచ్చిపోతూ ఉండడం, వెనకాల బుద్ధిగా మంచి బాలుడు టైపులో చేతులు కట్టుకున్న అమెరికా ఉపాధ్యక్షుల వారైన మైక్ పెన్స్ గారు ప్రెసిడెంట్ గారి వెనకాల వేపు చేతికి అందిన చోట రహస్య గిల్లుడు గిల్లడం, కోవింద్ కాదు బాబోయ్ అని దాన్ని కోవిడ్-19 గా ట్రంప్ గారు సరిదిద్దుకోడం బహుశా నేను ఒక్కడినే గమనించి ఉంటాను. అదే కనక సిఎన్నెన్ లాంటి టీవీ వారు గమనించి ఉంటే..ఓరి నాయనోయ్....నా మాట అబద్ధం అయితే మరి ట్రంప్ గారు స్వయానా ఈ కోవిడ్ 19 తబకి సోకిందేమో అని ఎందుకు వైద్య పరీక్షలు చేయించుకునట్టూ? ఈ వెటకారం వెలగని వారికి కోవింద్ మన భారత రాష్ట్రపతి గారి పేరు అని గుర్తు చేస్తున్నాను. అయినా వెలగని ట్యూబ్ లైట్లకి స్విచ్ ఆఫ్ చేస్తున్నాను.



మైక్రోస్కోప్ లో చూస్తే మా చిన్నప్పుడు ఆడేసి పారేసి, బొచ్చు సగం ఊడిపోయిన బాల్ బాడ్ మింటన్ బంతి లా ఉండే ఈ మహమ్మారి గాలిలో రెండు గంటలు, రాగి, కంచు మీద నాలుగు గంటలూ, స్టీలు పళ్ళాల మీద ఎనిమిది గంటలూ, ప్లాస్టిక్ మీద ఒక రోజు బతికి ఉండి మనుషుల మీదకి దాడి చేస్తుంది అని ఇప్పటి దాకా తెలిసిన కొంత సమాచారం. అది తెలియగానే "అన్నీ వేదాల్లోనే ఉన్నాయిష" అనే ప్రగాఢమైన, బలమైన చాదస్తపు వాదం మళ్ళీ తెర మీదకి...అదే....ఫేస్ బుక్ లోకి ఎక్కింది. ఉదాహరణకి "నారదోపాఖ్యానం లో మూడో అధ్యాయం, నాలుగో శ్లోకం లో పూజ లో వాడే ఉద్ధరిణ, పంచ పాత్ర రాగి వే ఉండాలి అని మన మహర్షులు నిర్దేశించడానికి శాస్త్రీయపరమైన సిద్ధాంతం ఈ సూక్ష్మ జీవుల వ్యాపక నిరోధన శక్తి ఆ లోహానికి ఉండడం మాత్రమే" అనే ఒక నన్ను బాగా ఆకట్టుకున్నఒక ముఖ పుస్తక ఉవాచ. మరొకటి "ఒక చెంచాడు గీకేసిన, గోకేసిన వెల్లుల్లి, మరొక చెంచాడు తోలు తీసేసిన, అతి చిన్న ముక్కలుగా కోసేసిన అల్లం, ఒక చెంచాడు తేనె, కాస్త నిమ్మ రసం" అన్నీ రంగరించి, గుటుక్కుమని ఒకే గుక్కలో తాగితే ఈ కరోనా యే కాక దాని అమ్మ కూడా మీ జోలికి రాదు. ఒక వేళ వస్తే ఇంకెక్కడికీ పోదు" అనే మరొక ఫేస్ బుక్ పోస్ట్ కూడా నన్ను బాగా ఆకర్షించి కానీ ఇండియాలో ఉన్న మా క్వీన్ విక్టోరియా దాన్ని తీవ్రంగా ప్రతిఘటించింది. ఎందుకంటే ఆ ద్రావకాన్ని కేవలం మట్టి గళాసులోనే తాగాలిట. అవి అమెరికాలో దొరకవు కాబట్టి తను వెనక్కి వచ్చేటప్పుడు కూడా పట్టుకొచ్చే దాకా బుద్ధిగా ఉండమని హెచ్చరించింది. ఇక గోమూత్రానికి ఉన్న సర్వ కరోనా రోగ నివారణ శక్తి గురించీ వచ్చిన అధికారిక వ్యాఖ్యలు చెప్పనే అక్కర లేదు. ఈ సారి మా క్వీన్ విక్టోరియా పెట్టెలలో సగం మట్టి కప్పులూ, సగం ఆర్గానిక్ గోమూత్రం సీసాలూ ఉన్నా ఆశ్చర్య పోను. ఇక తెలుకాటుకి వేద మంత్రం లాగా వేదాలలోనే ఉన్న కరోనా మంత్రం వెతికి తీసి ఆ మాయ రోగాన్ని కుదిర్చే దొంగ బాబాలూ, స్వామీజీలూ, 'విష జ్వర పీడ హర యాగం' చేయించే వారు ఈ పాటికి చాలా మందే అవతరించి ఉంటారు.

అంతెందుకు, ఒకానొక టీవీ చర్చా వేదికలో మిగతా దేశాల కంటే భారత దేశం లొ కరోనా వ్యాప్తి బాగా తక్కువగా ఉండడానికి కారణం మంది కర్మ భూమి అనీ, మనల్ని ఏదో శక్తి రక్షిస్తోంది అనీ ఖచ్చితంగా చెప్పాడు. నిజానికి అలాంటి శక్తి మనల్ని రక్షించాల్సింది రాజకీయ నాయకుల నుంచి. అయితే గత పదిహేను రోజులగా అన్ని తెలుగు టీవీ చర్చా వేదికలలోనూ అసభ్యంగా అరుచుకుంటూ కొట్టుకు చచ్చిపోయే రాజకీయ దౌర్భాగ్యుల బదులు డాక్టర్లూ, శాస్త్రవేత్తలూ మాత్రమే కనపడుతూ మంచి సమాచారాన్ని ఇస్తూ ఉండడం బావుంది.

మొన్న మా అర్ధాంగి తో ఇండియా వాట్సాప్ ఫోన్ పెట్టెయ్యగానే, మళ్ళీ నా సెల్ ఫోన్ మోగింది. 'హాయ్, రాహూ, దిస్ ఈజ్ బార్బరా" అనగానే నేను "ఏమోయ్, ఎప్పటిలాగానే అందంగా ఉన్నావా?" అన్నాను నా సహజ ప్రవృత్తిలో..అదేమిటో అమ్మాయిలతో మాట్లాడినప్పుడు అలా అనడం నా అలవాటు మరి. ఏం చేస్తాం.? మామూలుగా అయితే ఆ చక్కటి అమెరికా పిల్ల కిచ కిచా నవ్వేసును కానీ ఈ సారి భోరుమని ఏడ్చేసింది. నేను నిర్ఘాంతపోయి "ఏమయింది, బార్బ్...మళ్ళీ విడాకులా" అనగానే "యువర్ స్టాక్స్.. పోర్ట్ ఫోలియో ..." అని మళ్ళీ వల, వలా భోరుమంది మా బార్బరా.

ఆ బార్బరా అనే దొరసాని మా ఆర్థిక సలహాదారు. అనగా నేను అస్సలు కష్టపడకుండానూ, మా క్వీన్ విక్టోరియా జీవితాంతం ఎంతో కష్టపడీ కలిసి మెలిసి పొదుపు చేసుకున్న పావలా, అర్ధా ఆర్థిక వనరులకి కాపలా దారు. తెలుగులో చెప్పాలంటే ఆ అమ్మాయి ఇన్వెస్ట్మెంట్ అడ్వైజర్' అనమాట. అలాంటి కీలకమైన అమ్మాయి ప్రత్యేకంగా ఫోన్ చేసి భోరుమని విలపిస్తూ ఉంటే నా హృదయం కరిగి పోవడం మానేసి, ఆ పిల్లని 'హగ్గింగ్' పేరిట దగ్గరకి తీసుకుని ఊరట కలిగించే అవకాశం లేదు కాబట్టి నా గుండె కాయ మరింత వేగంగా కొట్టుకోవడం మొదలు పెట్టింది. ఆ హృదయ వేగాన్ని అదుపులో తెచ్చుకునే ప్రయత్నం లో ఉండగా ఆ పిల్ల గద్గద స్వరంతో "కరోనా, కోవిడ్, ట్రంప్, ఎకానమీ, స్టాకుల ఘోర పతనం" లాంటి మాటలు మాట్లాడగానే నాకు విషయం అర్థం అయి, సోఫాలో కూలబడ్డాను. ఇక ఏమనాలో తెలియక "ఎంత?" అని బార్బరా ని అడిగాను. "ఎంత క్షవరం అయిందో చెప్పమంటావా, లేక ఇంకా ఎంత మిగిలిందో చెప్పమంటావా?" అంది పాతాళ భైరవిలో ఎన్ టీ ఆర్ టైపులో బార్బరా. చెప్పొద్దూ, బార్బరా అనే ఆ పిల్ల ఆర్థిక సలహాల వలన మనకి జరిగినది తిరుపతి బాపతు సగం క్షవరమో, లేక మా ఆస్థాన మంగలి వీర్రాజు మా అమ్మమ్మకి చేసే సంపూర్ణ గుండు గీకుడో తెలియక, ఏది ఏమైనా తన వృత్తి పేరు నిలబెట్టుకుంది అనిపించింది. ఎందుకంటే అమెరికాలో క్షవరం చేసే మగాడు బార్బర్. అదే ఆడమ్మాయి

అయితే బార్బరా....ఏ రాయి అయితేనేం, పళ్ళు రాలగొట్టుకోడానికీ? మొత్తానికి కరోనా ధర్మమా అని "ఉన్నది కాస్తా ఊడింది. పెళ్ళాం నగలతో సహా తిరుక్షవరమై పోయింది" కానీ పెళ్ళాం నగలు ఇండియాలో ఉన్నాయి కాబట్టి అవి మిగిలి పోయాయి అనే అనుకుంటున్నాను.

సీరియస్ లీ...

ఇది వరకూ వచ్చిన విష జ్వరాల మాట ఎలా ఉన్నా, ఈ నొవెల్ కోవిడ్ –19 అనే కరోనా కి మందు ఏమిటో అమెరికాతో సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న డాక్టర్లకీ, శాస్త్రవేత్తలకీ ఇంకా అంతు పట్టడం లేదు. ప్రస్తుతం మనం అందరం చెయ్యగలిగినదీ, చేసి తీర వలసినదీ ఆ వ్యాధి వ్యాపించకుండా "స్వయం ప్రకటిత వెలివేత" పాటిస్తూ శరీరాలకి దూరంగా ఉంటూనే మన వారి మనసులకి దగ్గర అవడమే ఏకైక మార్గం. ఏమంటారు? ఏకంగా బ్రిటన్ యువరాజు ప్రిన్స్ చార్లెస్ కీ, ప్రధాన మంత్రికీ, హాలీవుడ్ మెగా నటుడు టామ్ హాంక్స్ లాంటి వారికే కరోనా సోకగా లేనిది, ఆఫ్టరాల్ నేనూ, మీరూ ఒక లెక్కా అని అనుకోవచ్చును కానీ అది నిజం కాదు. మనం కూడా లెక్కించదగిన వాళ్ళమే. అందుకే మనల్నీ, మన పక్క వారినీ కాపాడుకోవడం ఇప్పుడు మన ఏకైక కర్తవ్యం.

అందరికీ శార్వరి నామ సంవత్సర శుభాకాంక్షలతో...హేపీ క్వారంటీన్....

**COMMENTS**